# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 53 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 15 అక్టోబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## రెండో టెస్టులో భారత్ ఘన విజయం

### 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై విక్టరీ

శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ నెగ్గింది. ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, పర్యాటక జట్టు విండీస్‌ను ఫాలో-ఆన్ ఆడించింది. తొలి టెస్టులో ఎదురైన సీన్ దాదాపు రిపీట్ అయింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్ లో తమ పోరాటాన్ని చూపారు. ఈసారి చాలా ధైర్యంగా, నిలకడగా భారత బౌలర్లను ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే భారత్ ఛేదించడానికి 121 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఇచ్చింది విండీస్ జట్టు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా, భారత్ సునాయాసంగా విజయం సాధించింది.

# లొంగిపోయిన మల్లోజుల

## మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ

### పార్టీ అనుసరిస్తున్న తీరుపై కొంతకాలంగా అసంతృప్తి

న్యూఢిల్లీ,అక్టోబర్14 (నమస్తే ఉదయం)

మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన పోలీసులకు లొంగిపోయారు. కొద్దిరోజుల కిందట తన సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావుకు కిషన్‌జీ పేరుతో వేణుగోపాల్‌రావు ఒక లేఖ రాశారు. అందులో మావోయిస్టు పార్టీ విధానాలపై వేణుగోపాల్‌రావు కొంతకాలంగా అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదంటూ మావోయిస్టు పార్టీకి **మొదటి పేజీ తరువాయి...**

ఆయన రాసిన మరో లేఖ కలకలం రేపింది. దాని తర్వాత ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. అనివార్య కారణాలతో పార్టీని వీడుతున్నానని.. ఇకపై పార్టీలో కొనసాగబోనని ప్రకటించారు. ఈ క్రమంలోనే 60 మందితో కలిసి గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. ఆయన రాసిన లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. నిన్నటి పొరపాట్లను విశ్లేషించుకోవడం ద్వారా నేడు, రేపు వాటిని నివారించడం ఎలాగో మనం నేర్చుకుంటాం. తప్పుల నుంచి గుణపాఠాలు తీసుకోవడం రోగం రాకుండా టీకా తీసుకోవడం వంటిది. విప్లవోద్యమాన్ని కూడా అదే తీరుగా నడిపించగలుగుతాం. ఇది నల్లేరు మీద బండిలా సాగే పని ఎంతమాత్రం కాదు. తీవ్రమైన అధ్యయనం, ఓపికతో, త్యాగాలతో కూడిన విప్లవాచరణ' అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు.





ఈ మేరకు మావోయిస్టు పార్టీకి ఆయన 22 పేజీలతో కూడిన సుదీర్ఘ లేఖను ఈ నెల 6వ తేదీన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం ఉన్నదని, ఆయుధ పోరాటాలను తాతాలికంగా విరమించాలని ఆ లేఖలో కోరారు. దశాబ్దాల తరబడి తప్పుడు విధానాలే తీవ్రమైన నష్టాలకు కారణమని, 'సైన్యం తప్ప రహస్య పార్టీ లేదు' అని ఆయన ఖరాకండిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాతాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించి, ప్రజల మధ్యకు బహిరంగంగా వెళ్లాలని ఆయన క్యాడర్‌ను కోరారు. పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించిన మౌలికమైన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి సైన్యంతో ఉంటే సాధ్యం కాదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'విప్లవపార్టీ లేకుండా విప్లవమే లేదు' అనే లెనిన్ సూత్రాన్ని విస్మరించడం వల్ల, మావోయిస్టులకు సైన్యం తప్ప రహస్య పార్టీ లేని స్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతమున్న ఏసీ, డీవీసీ వంటి పార్టీ కమిటీలన్నీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వెంట, సైనిక దుస్తులలో సాయుధులుగా ఉండటం బహిరంగ రహస్యమేనని అన్నారు. వీటిని శత్రువుకు అబేధ్యమైన రహస్య పార్టీ నిర్మాణాలుగా పరిగణించలేమని, ఇదే బలహీనత శత్రువుకు పార్టీని నిర్మూలించేందుకు పూర్తి అవకాశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో దండకారణ్యం, బీహార్-జార్ఖండ్‌లలో బేస్ ఏరియాలను నిర్మించే కేంద్ర కర్తవ్యాన్ని చేపట్టడం రెండో వ్యూహాత్మక తప్పిదమని

..మిగతా 2లో



## గ్రూప్-2 విజేతలకు నియామక పత్రాలు

### 18న సీఎం రేవంత్ చేతుల మీదుగా శిల్పకళా వేదికలో అందచేత

### ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్,అక్టోబరు14 (నమస్తే ఉదయం)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి

..మిగతా 2లో




## నీటిపారుదల శాఖలో 106 మంది ఇంజినీర్లు బదిలీ

హైదరాబాద్, అక్టోబర్14 (నమస్తే ఉదయం)

నీటిపారుదల శాఖలో అవినీతి అధికారుల వ్యయహారం కలకలం రేపుతున్న తరుణంలో ..హైదరాబాద్ సర్కిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బదిలీ అయిన ఇంజినీర్లలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు, క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేతస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది.

## విశాఖలో గూగుల్ సెంటర్

### వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం

### సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు




న్యూఢిల్లీ,అక్టోబర్14 (నమస్తే ఉదయం)

విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ

..మిగతా 2లో

## ప్రైవేటు బస్సులో మంటలు

# 20 మంది సజీవ దహనం



**రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రైవేటు బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో 20 మంది సజీవ దహనం అయ్యారు. మరో 16 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. బస్సులో మంటలు చెలరేగడంతో.. వాటి నుంచి తప్పించుకునేందుకు ప్రయాణికులు.. కిటికీల్లో నుంచి బయటికి దూకేశారు. ఈ ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.**

జైసల్మేర్, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం)

రాజస్థాన్‌లో ఓ ప్రైవేటు బస్సు.. మంటల్లో కాలి బూడిదైంది. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సులో మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఇక ప్రమాద సమయంలో బస్సులో 57 మంది ప్రయాణిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఇక ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్న పిల్లలు, నలుగురు మహిళలు సహా ఇప్పటివరకు మొత్తం 15 మంది సజీవ దహనం అయ్యారు. బస్సులో మంటలు వేగంగా వ్యాపించడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. గాయపడిన వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న ఆ బస్సులో తాహయట్ గ్రామం సమీపంలో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆ ప్రైవేట్ బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నారు. జైసల్మేర్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బస్సు బయలుదేరగా.. సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత.. తాహయట్ గ్రామం వద్ద బస్సు వెనుక భాగం నుంచి పొగ రావడాన్ని బస్సులోని ప్రయాణికులు గమనించారు. అయితే చూస్తుండగానే.. క్షణాల్లోనే మంటలు మొత్తం బస్సును చుట్టుముట్టాయి.ప్రమాదం గురించి తెలియగానే.. సమీపంలోని గ్రామస్తులు, వాహనదారులు ఆ బస్సు వద్దకు చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. గాయపడిన వారిని 3 అంబులెన్స్‌ల్లో జైసల్మేర్‌లోని జవహీర్ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక బస్సు మంటల్లో కాలిపోతున్న దృశ్యాలను స్థానికులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో మంటలు భారీ ఎత్తున ఎగిసిపడుతుండగా.. దట్టమైన పొగతో ఆ ప్రాంతం మొత్తం నల్లగా అలుముకుపోయింది. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే బస్సులో ఒక్కసారిగా ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకోవడానికి గల కారణాల ఏంటి అనేది ఇంకా తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సు రద్దు

### దగ్గు మందు మరణాలతో తమిళనాడు నిర్ణయం

చెన్నై,అక్టోబర్14 (నమస్తే ఉదయం)

శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సును తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ రద్దు చేసింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ చేస్తున్న ఆ కంపెనీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు డ్రగ్స్ శాఖ వెల్లడించింది. కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రాణాంతకమైన డైఇథలీన్ గ్లైకాల్ ..మిగతా 2లో



# బీసీలకు అండగా కాంగ్రెస్ పార్టీ

**42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం**
**హైకోర్టు జీవోను కొట్టేయడం బాధాకరం**
**సుప్రీంలో గట్టిగా వాదనలు వినిపించేందుకు సిద్ధం**
**అభిషేక్ మను సంఘ్వితో చర్చించామన్న పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**



న్యూఢిల్లీ,అక్టోబర్14 (నమస్తే ఉదయం)

తెలంగాణ ప్రభుత్వం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిందని.. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో చారిత్రాత్మకమని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల జీవితాలు బాగుపరచాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అడుగడుగున బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తూ వచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ వెనక్కు తగ్గలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో ముందుకు వెళ్లామని చెప్పారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లేందుకు పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించామని.. కానీ రాష్ట్ర హైకోర్టు జీవో 9 పై స్టే విధించిందన్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని పీసీసీ చీఫ్ అన్నారు. పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ స్టే విధించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరపున ఎస్ఎల్పీ దాఖలు చేశామని.. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో దాదాపు గంట పాటు చర్చించినట్లు చెప్పారు. అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించామన్నారు. గురువారానికి కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. హైకోర్టు పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని చెప్పిన నేపథ్యంలో బాధతో సుప్రీంకోర్టుకు వచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని.. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడతే అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని.. కానీ ఇప్పుడు మాట మార్చి బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. 42 రిజర్వేషన్లు ఎక్కడా తగ్గకుండా ముందుకు వెళ్తున్నామని.. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. తమది న్యాయబద్ధమైన కోరిక అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మహేష్ గౌడ్ మంగళవారం భేటీ అయ్యారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున గట్టి వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాదిని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం)

సామాన్యులను దూరం చేసుకుంటున్న బంగారం సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో .1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది.మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చున్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చున్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. అటు వెండి ధర కూడా భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## గ్రూప్-2 విజేతలకు నియామక పత్రాలు

మొదటి పేజీ తరువాయి...

అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఇద్దరు కవల పిల్లల్ని గొంతు నులిమి మూడంతస్తుల భవనంపైనుండి దూకి మహిళ ఆత్మహత్య

కూకట్‌పల్లి, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం)సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాలలో తీవ్ర విషాదం నెలకొంది. భార్యాభర్తల గొడడ వల్ల కన్నతల్లి తన ఇద్దరు కవల పిల్లలను హత్య చేసి.. ఆపై తల్లి సాయి లక్ష్మి కూడా మూడంతస్తుల భవనం పైనుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా కలకలం గా మారింది. స్థానికులు, ఇన్స్ పెక్టర్ సీఐ నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్ 1 లో సాయి లక్ష్మి, అనిల్ కుమార్ లు నివాసం ఉంటున్నారు. ఈ మేరకు సాయి లక్ష్మి (27) మంగళవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో తన కవల పిల్లలైన చేతన్ కార్తికేయ(2), లాస్య వల్లి (2) లను గొంతు నులిమి చంపింది. అనంతరం తల్లి సాయి లక్ష్మి తన నివాసం ఉంటున్న ఇంటి మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా కుమారుడు కార్తికేయ కు రెండు సంవత్సరాలు వచ్చినా మాటలు రాకపోవడంతో గత కొద్దిరోజులుగా భర్త అనిల్ తో గొడవ కారణంగా సాయి లక్ష్మి తన పిల్లలను చంపి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న సంఘటన స్థలానికి చేరుకున్న బాలానగర్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి వివరాలు సేకరిస్తున్నారు.





## లొంగిపోయిన మల్లోజుల

మొదటి పేజీ తరువాయి...

వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ బలాన్ని అతిగా అంచనా వేసి, శత్రువు బలాన్ని తకువ చేసి చూశామన్నారు. 2011 నుండే కిందిస్థాయి కామ్రేడ్స్ ఈ తప్పును సరిదిద్దుకోవాలని కోరినప్పటికీ, సీసీ పట్టించుకోలేదని అన్నారు. ఒక దశాబ్దం పాటు నష్టపోయామని తెలిపారు. ఇప్పటికైనా అమరుల రక్తతర్పణం నుండి గుణపాఠాలను తీసుకుందామని పేర్కొన్నారు. రహస్య, చట్టబద్ధ పోరాటాల మధ్య సమన్వయాన్ని కొనసాగించడంలో సెంట్రల్ కమిటీ పూర్తిగా విఫలమైందని ఇది మూడో తప్పిదమని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. 2006 నూతన అటవీ చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చే భూమి పట్టాలను 'బేస్ ఏరియాలు నిర్మిస్తున్నామనే ధీమాతో' వ్యతిరేకించాం. దండకారణ్యంలోని రైతులకు మన జనతన సరార్‌లే పట్టాలిస్తాయని చెప్పాం, కానీ ఆ పట్టాలకు వ్యవస్థలో గుర్తింపు లేదనే ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను విస్మరించామని తెలిపారు. ప్రజలు తమ జీవితావసరాల కోసం అనివార్యమైన ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా పార్టీ వ్యతిరేకించడం, ప్రజలు దొంగచాటుగా ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి వాటిని పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేరొన్నారు. 'ఇప్పుడు మనకు సానుకూల మార్పు కావాలి. ఉద్యమాన్ని కాపాడుకోవడం, క్యాడర్‌ను రక్షించుకోవడం కావాలి. అనవసర త్యాగాలకు అంతం పలుకుదాం. నూతన పద్ధతులలో పురోగమిద్దాం. అంతిమ విజయం ప్రజలదే' అంటూ మల్లోజుల తన లేఖను ముగించారు. తాను కేంద్ర కమిటీలో 28 ఏండ్లు, పొలిట్ బ్యూరోలో 18 ఏండ్లు సభ్యుడిగా ఉన్నట్టు మల్లోజుల తెలిపారు. ప్రస్తుతం ఉద్యమం ఎదురొంటున్న వైఫల్యాలకు, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ, యావత్ పార్టీ క్యాడర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఇంతటి నష్టాలకు దారితీసిన నాయకత్వంలో కొనసాగడానికి అనర్హుడిని అని ప్రకటించారు. గతంలో దివంగత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) కూడా ప్రభుత్వంతో శాంతి చర్చల పక్రియను ప్రారంభించారని, ఏప్రిల్ 2025 నాటికి ఈ నిర్ణయం అనివార్యమని భావించారని గుర్తు చేశారు.

## శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సు రద్దు

మొదటి పేజీ తరువాయి...

ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో 21 మంది చిన్నారుల మృతికి కారణమైన ఆ ప్రాణాంతక ఔషధం ఆ దగ్గుమందులో ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు సర్కారు 2011లో శ్రీసన్ ఫార్మసీ కంపెనీకి దగ్గుమందు తయారీకి లైసెన్సు జారీ చేసింది. 2016లో ఆ లైసెన్సుకు రెన్యూవల్ చేశారు. శ్రీసన్ కంపెనీ లైసెన్సు రద్దు చేసి, దాన్ని పూర్తిగా మూసివేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర డ్రగ్ తయారీ కంపెనీలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు శ్రీసన్ ఫార్మసిట్యూకల్స్‌తో పాటు కొందరు డ్రగ్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. మధ్యప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అక్టోబర్ ఒకటో తేదీన తమిళనాడు అధికారులకు ఆ దగ్గుమందుపై అలర్ట్ జారీ చేసింది. కోల్డ్రిఫ్‌తో పాటు అయిదు రకాల ఉత్పత్తులను చెన్నై ల్యాబ్‌లో పరిశీలించారు. దగ్గు సిరప్‌లో ప్రాణాంతకమైన డీఈజీ ఉన్నట్లు గుర్తించారు. అక్టోబర్ 9వ తేదీన మధ్యప్రదేశ్ పోలీసులు కంపెనీ ఓనర్ రంగనాథన్‌ను అరెస్టు చేశారు. 2023లో సరైన రీతిలో తనిఖీలు నిర్వహించని ఇద్దరు తమిళనాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను కూడా సస్పెండ్ చేశారు.

## విశాఖలో గూగుల్ సెంటర్

మొదటి పేజీ తరువాయి...

విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచు కునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఢిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి కావడం విశేషం.

# కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటు పడినవారికే పట్టం

**ఏఐసీసీ కార్యదర్శి,**
**పరిశీలకురాలు డా. అంజలి నింబాల్కర్.**

కూకట్‌పల్లి, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం)కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట లోని లియో బంక్యాట్స్ హాల్ లో నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడి అభ్యర్థి ఎంపిక కోసం జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సంఘటన్ సృజన్ అభియాన్ ముఖముఖి ప్రత్యేక సమావేశనికి ముఖ్య అతిధిగా హాజరైన ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు డా. అంజలి నింబాల్కర్, డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరైనారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు డా. అంజలి నింబాల్కర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులకే పార్టీ అధిష్టానం పట్టం కడుతుందని అన్నారు. అనంతరం సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాంగ్రెస్ లో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉ ంటుందని, పార్టీ నాయకుల, కార్యకర్తల అభిష్టానానికి అనుగుణంగా డీసీసీ అధ్యక్షుల నియమాకం జరగాలని రాహుల్ గాంధీ స్పష్టం చేయడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనకనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేసేందుకు డీసీసీ నియామకాలు పార్టీ అధిష్టానం చేపడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుష్పా రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారి, కార్యదర్శులు దండుగుల యాదగిరి, గాలి బాలాజి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు గోపిశెట్టి రాఘవేందర్, శ్రీనివాస్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. సలీం, తూము వినయ్, సాధు ప్రతాప్ రెడ్డి, కర్క పెంటయ్య, గంధం యేసు రాజు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ, మహిళ కాంగ్రెస్, అనుబంధ సంఘల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలు, మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వార్షిక తనిఖీలలో భాగంగా గద్వాల్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**స్టేషన్ పరిసరాల శుభ్రత, రికార్డ్స్ మెంటేనేన్స్, క్రైమ్ వెహికల్స్, సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ**

**బాధ్యత, సేవ, అధికారంతో కూడినది పోలీసు ఉద్యోగం : జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**



గద్వాల జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 14(నమస్తే ఉదయం)పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వాహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, మరియు చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం గద్వాల్ పట్టణ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న/ కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డు లను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. రిసీప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. పోలీస్ అధికారులు తమకు కేటాయించిన వార్డు పై పూర్తి అవగాహన ఉండాలని, వార్డు పెద్దలతో, యువతతో సత్సంబంధాలను కలిగి ఉండాలని అన్నారు. స్టేషన్ పరిదిలో గల రౌడీ, సస్పెక్ట్ హిస్టరీ షీటర్లను చెక్ చేస్తూ ఆన్లైన్ రికార్డులో నమోదు చేయాలన్నారు. ఇతర ప్రాంతాలలో ఉండే వారి షీట్స్ ను సంబందిత ప్రాంతాలలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ లకు పంపాలని తెలిపారు. అలాగే పాపిలోన్ డివైస్ ను వినియోగించి అనుమానిత వ్యక్తుల వేలిముద్రాలను చెక్ చేస్తూ.. పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ.. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు.

స్టేషన్ రికార్డులైన ఎస్.సి.ఎచ్. పార్ట్ 1 %-% 5, జనరల్ డైరీ, ఎఫ్.ఐ.ఆర్. ఇండెక్స్, అల్ఫాబీటికల్ ఇండెక్స్, డ్యూటి రోస్టర్, విస్టింగ్ నోట్ బుక్స్, రౌడీ, సస్పెక్ట్ షీట్స్, గన్ లైసన్స్ రిజిస్టర్, ఎల్.ఎల్.ఐ., గవర్నమెంట్ ప్రాపర్టీ రిజిస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, మొదలగున్నవి చెక్ చేసి, పెండింగ్ లేకుండా చూడాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహానాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహణదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డైల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉ న్నాయని, అన్ని అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉ పయోగపడుతుందన్నారు.

సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..... పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వాహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, మరియు చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని తెలిపారు. పోలీసు సిబ్బంది ప్రతి చర్య ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా ఉండాలని, సేవాభావం మరియు నిజాయితీతో విధులు నిర్వర్తించడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని సూచించారు. విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చు అన్నారు. ఒకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చెయ్యాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. పోలీస్ స్టేషన్, రికార్డుల మెయింటనెన్స్, సిబ్బంది పని తీరు పై సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో జిల్లా ఎస్పీ, డి.ఎస్పీ మొక్కలు నాటారు. అప్పుడే అక్కడకు వచ్చిన న్యూ హౌసింగ్ బోర్డు చెంది పిర్యాదురాలు తో , జిల్లా ఎస్పీ మాట్లాడి, పిర్యాదురాలి సమస్యను తెలుసుకొన్నారు. ఇట్టి పిర్యాదు పై తగు చర్యలు తీసుకోవాలని కల్యాణ్ కుమార్ ని ఆదేశించారు. ఈ తనిఖీ లలో ఎస్పీ వెంటా డి.ఎస్పీ మొగిలయ్య, గద్వాల్ టౌన్ ఎస్సై-1 కల్యాణ్ కుమార్, ఎస్సై-2 సతీష్ కుమార్, ఎస్సై-3 జహాంగీర్ ఉన్నారు.



మిడ్కో జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

## కడవెండిలో ఘనంగా రేణుక (మిడ్కో) జయంతి వేడుకలు

**భూమ్మీద అక్షరం ఉన్నంత కాలం తమ బిడ్డ బతికే ఉంటుంది**

**అ అంటే అమ్మ ఆ అంటే ఆదివాసీ.. తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య**

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం): కడవెండి ముద్దు బిడ్డ,భారత విప్లవోద్యమంలో, విప్లవ సాహిత్యంలో తనదైన ముద్ర వేసిన గుముడవెల్లి రేణుక (మిడ్కో) 55వ జయంతి వేడుకలు ఆమె స్వస్థలం కడవెండి గ్రామంలో, మంగళవారం వారి పెదనాన్న గుముడవెల్లి లక్ష్మీనరసయ్య ఇంటి ఆవరణలో జరిగాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య మాట్లాడుతూ భూమ్మీద అక్షరం ఉన్నంత కాలం తమ బిడ్డ బతికే ఉ ంటుందని, మిడ్కో కు అ అంటే అమ్మ ఆ అంటే ఆదివాసీలు మాత్రమే తెలుసని అన్నారు. దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం ముందు ఆడుతూ, పాడుతూ పెరిగి పెద్దయిన రేణుక, తిరుపతిలో లా చదువుతూ, విప్లవ రచయిత్రిగా, ఉద్యమకారిణిగా ఎదిగిన క్రమాన్ని గ్రామస్థులు, కుటుంబసభ్యులు గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చ్ 31న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో జరిగిన 'ఎన్‌కౌంటర్'లో రేణుక మరణించారన్నది విదితమే. మిడ్కో, దమయంతి లాంటి అనేక కలం పేర్లతో రేణుక రాసిన సాహిత్యాన్ని ఇటీవలే విరసం మూడు సంపుటాలుగా ప్రచురించింది. ఆమె మృతి చెందిన తర్వాత మొదటిసారి జరిగిన జయంతి సందర్భంగా ఆమె స్మారక స్తూపానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు గ్రామస్తులు పంతం అచ్చయ్య, కాడబోయిన స్వామి, కాశబోయిన యాకయ్య తదితరులు రేణుక కు ఘనంగా నివాళులు అర్పించారు.



ఇందిరా మహిళా శక్తి భవనాన్ని పరిశీలిస్తున్నా జిల్లా కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు

## ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం)జనగామ మండలం పెంబర్తి గ్రామం వద్ద రూ.5 కోట్ల తో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో కలిసి కలెక్టర్ సందర్శించి పరిశీలించారు.నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలని జాప్యం తగదన్నారు. పనులు నాణ్యతాపరంగా చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్ ఉన్నారు



ప్రజావాణిలో భాగంగా ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

## ప్రజల విజ్ఞప్తులను వేగవంతంగా పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13(నమస్తే ఉదయం): ప్రజావాణి పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అదనపు కలెక్టర్ లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) బెన్ షాలోమ్ లతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 38 దరఖాస్తులు స్వీకరించారు. అందులో కొన్ని దరఖాస్తులు ఇలా ఉన్నాయి. లింగాల ఘన్పూర్ మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు నడిగోటి సోమయ్య తన దరఖాస్తు అందిస్తూ...సర్వే నెంబర్ 263 పట్టా భూమిలో 25 ఎకరాల భూమి ఉందని, 1938లో వర్షపు నీరు చెరువుకు వెళ్లేందుకు నీటిపారుదల శాఖ పంట కాల్వ నిర్మించిందని, ప్రస్తుతం శివరాత్రి ఐలయ్య అనే వ్యక్తి దౌర్జన్యంగా కానీలు లు పాతి వర్షపు నీరు చెరువుకు వెళ్లకుండా అడ్డుకొని పంట కాల్వను పూడ్చి వేయడంతో తన భూమిలో నీరు నిలుస్తున్నదని అధికారులు తగు చర్య తీసుకోవాలని విజ్ఞప్తి అందించారు.జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన ముక్క రాజయ్య తన తండ్రి పేరుతో ఉన్న భూమి సర్వే నెంబర్ 10/ 79 లోని 1.20 ఎకరం భూమిని వారసత్వంగా పట్టా మార్పిడి చేసి ఇవ్వాలని కోరారు.బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి కి చెందిన తాలిరెడ్డి మధుసూదన్ రెడ్డి గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 202లో పూర్వీకుల నుండి సంక్రమించిన 1.10 ఎకరంలో భూమి కి రైతుబంధు అందుతుందని తన భూమి లేదని దయాధులు చెబుతున్నారని, అట్టి భూమికి హద్దులు చూపించి ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దేవరుప్పల మండలం నిర్మల గ్రామానికి చెందిన దూదేకుల జమాల్ సర్వేనెంబర్ 260లో 20 గుంటలు 290 లో 20 గుంటలు పాత పుస్తకంలో నమోదుగా ఉన్నదని కొత్త పుస్తకంలో ఎక్కించి ఇవ్వాలని దరఖాస్తు అందించారు.స్టేషన్ఘన్పూర్ కు చెందిన సముద్రాల శంకర్ తనకు స్టేషన్ఘన్పూర్ శివారులో 494/సి, 500/1 లో 3.20 ఎకరముల భూమి ఉందని, కాస్తు లో ఉన్నానని పుస్తకంలో నమలి గొండ లో అని తప్పుగా నమోదయినందున స్టేషన్ఘన్పూర్ శివారు అని నమోదు చేసి ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి దరఖాస్తును సమగ్రంగా సమీక్షించి సంబంధిత అధికారులకు అందజేయడం జరుగుతుందని, సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని తెలియజేశారు.ఈ ప్రజావాణి లో జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీఓ లు గోపిరామ్, డి.ఎస్.వెంకన్న, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, గృహనిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ.శ్రీకాంత్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మహాసభలకు బయలుదేరిన కార్మికులు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం) తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు అనుబంధం) రాష్ట్ర ఐదవ మహాసభలకు జోగులాంబ గద్వాల జిల్లా నుండి ప్రతినిధులు హాజరయ్యారని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహతెలిపారు.రెండు రోజులపాటు జరిగే మహాసభలకు గద్వాలలోని నాలుగు మున్సిపాలిటీల నుండి ప్రతినిధులు తరలి వెళ్లారని తెలిపారు. మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, ఉద్యోగ భద్రత, అధికార వేధింపులు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు భవిష్యత్ కర్తవ్యాలు వంటి అనేక అంశాలపై మహాసభల్లో చర్చలు జరుగునున్నట్లు తెలిపారు.ఈరోజు, రేపు రెండు రోజుల పాటు జరిగే మహాసభల సందర్బంగా మొదటి రోజు ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.మహాసభలకు సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ రానున్నట్లు తెలిపారు. మహాసభలకు వెళ్ళిన వారిలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఏంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంజీవరాజు,ఘట్టన్న,పట్టణ అధ్యక్షుడు శివ, కోశాధికారి మహేష్ కుమార్, దయానంద్ వెళ్లారు.



## నేరాల నియంత్రణలో పటిష్టమైన చర్యలు: రూరల్ ఎస్.ఐ సిహెచ్ శ్రీకాంత్

**గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్.ఐ సిహెచ్ శ్రీకాంత్, సిబ్బంది**

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం) నేరాల నియంత్రణలో భాగంగా గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు గద్వాల రూల్ ఎస్.ఐ సిహెచ్. శ్రీకాంత్ మరియు వారి సిబ్బంది. జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈరోజు సాయంత్రం అనంతపురం టు వీరాపురం దగ్గర నేరాల నియంత్రణలో భాగంగా వాహనాలు ను విస్తృతంగా తనిఖీలు చేస్తూ గూడ్స్ వెహికల్ లో ఎక్కువ ప్యాసింజర్ ఉండడం వల్ల అట్టి వాహనాలకు ఫైన్ విధించి డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది అని రూరల్ ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్నామని ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా రూరల్ ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ తో పాటు వారి సిబ్బంది ఉన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను పంపిణి చేస్తున్న కడియం శ్రీహరి, కావ్య

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణి

**పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు....**

**అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు.**

**మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి....**

**అధికారులు లబ్ధిదారులకు బిల్లులు అందించాలి.**

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం)కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, అందుకే సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీదనే అమలు చేస్తుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్బంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 256మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే డిఆర్ డిఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వ్యవసాయ మోటార్లను పంపిణి చేశారు.

ఈ కార్యక్రమంలో జనగామ, హన్మకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు మాతృ నాయక్, హరికృష్ణ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, డిఈలు, ఏఈలు, ఎంపిడివోలు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించిన వెస్ట్రన్ సిడ్నీ యూనివర్శిటీ ప్రతినిధులు


వ్యవసాయ విశ్వవిద్యాలయం ను సందర్శించిన ఆస్ట్రేలియా వెస్టన్ సిడ్నీ విశ్వవిద్యాలయం ప్రతినిధులు

బుద్వేల్, అక్టోబరు 14 (నమస్తే ఉదయం) : ఆస్ట్రేలియా కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయం వెస్టన్ సిడ్నీ యూనివర్శిటీ ప్రొఫెసర్ అయాన్ అండర్సన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ రెండు విశ్వవిద్యాలయాలు యూజీ, పీజీ కోర్సులను కలసి చేయడానికి ఇటీవల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. వారికి వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య స్వాగతం పలికారు. బీఎస్సీ అగ్రికల్చరల్ కోర్సును మూడు సంవత్సరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒక సంవత్సరం వెస్టన్ సిడ్నీ యూనివర్శిటీలో చేయడానికి ఈ కీలక సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తయిన తర్వాత బీఎస్సీ అగ్రికల్చరల్ డ్యూయల్ డిగ్రీ పట్టాను విద్యార్థులు అందుకోవడం జరుగుం దన్నారు. పీజీ, పీహెచ్‌డి కోర్సులను వెస్టన్ సిడ్నీ యూనివర్శిటీలో విద్యార్థులు నేరుగా చేసుకోవడానికి ఈ ఒప్పందం లో నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ నుంచి ప్రతి సంవత్సరం 25 నుంచి 30 మంది విద్యార్థులు ఆస్ట్రేలియా లోని వెస్టన్ సిడ్నీ విశ్వవిద్యాలయం లో నేరుగా చదువుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. వ్యవసాయ రంగంలో వేగంగా వస్తున్న కృత్రిమ మేధా ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ రైతాంగానికి అందేవిదంగా వెస్టన్ సిడ్నీ యూనివర్శిటీతో వ్యవసాయ విశ్వవిద్యాలయం మరో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వెస్టన్ సిడ్నీ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆయాన్ అండర్సన్ మాట్లాడుతూ, భారత వ్యవసాయ పరిశోధన మండలి ఇప్పటికే తమ యూనివర్శిటీతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, దాని ప్రకారం భారత దేశంలోని వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో సం యుక్తంగా విద్యా, పరిశోధన రంగాలలో కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉ ఒదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టే విదంగా అగ్రి రోబెటిక్స్, కృత్రిమ మేధస్సు, అధారిత సాంకేతిక పరిజ్ఞానాలపై ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ, గత ఏడాది కాలంనుంచి 4 అంతర్జాతీయ, ఐదు జాతీయ సంస్థలతో వ్యవసాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 25 మంది విద్యార్థులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టన్ సిడ్నీ యూనివర్శిటీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం క్రింద ప్రవేశాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వెస్టర్న్ సిడ్నీ యూనివర్శిటీ ప్రొఫెసర్ మార్క్, డాక్టర్ నిషా రాకేశ్, డాక్టర్ కోపల్ చౌబే, వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి డీన్ లు డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ కే బి ఈశ్వరీ, డాక్టర్ రమణారావు, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అంతర్జాతీయ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డాక్టర్ రాములు, రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ లు పాల్గొన్నారు.


నవీన్, స్నేహల రిసెప్షన్ వేడుకలో నవీన్ తల్లితండ్రులు తూర్పు పద్మ, తూర్పు లక్ష్మణ్ లు

రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ నివాసులు తూర్పు పద్మ, తూర్పు లక్ష్మణ్ ల కుమారుడు నవీన్ రిసెప్షన్ వేడుక మంగళవారం బేగంపేటకు చెందిన బచ్చల సుకన్య, బచ్చల నర్సింగ్ రావు గార్ల ఏకైక పుత్రిక స్నేహతో ఘనంగా జరిగింది. ఈనెల 12న మాసబ్ ట్యాంక్ లోని ఖాజా మెన్షన్ ఫంక్షన్ హాల్ లో వీరి వివాహం జరగగా , మంగళవారం సాతంరాయి ఎల్ వీ ఎన్ గ్రీన్ ఎకర్స్ ఫంక్షన్ హాల్ లో రిసెప్షన్ వేడుక జరిగింది. ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, మిత్రులు రిసెప్షన్ వేడుకలో పాల్గొని వధు వరులను ఆశీర్వదించారు.


రిసెప్షన్ వేడుకలో నవీన్, స్నేహలను కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న స్నేహితులు



ఈసా కాలువ బఫర్ జోన్, జన చైతన్య ఫేస్ - 2 పార్కు స్థలంలో వెలసిన ఆక్రమణల కూల్చివేత

## ఈసా కాలువ బఫర్ జోన్, జన చైతన్య ఫేజ్-2 పార్కు స్థలాలలో నిర్మించిన ఆక్రమణలను తొలగించిన రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు




బుద్వేల్, అక్టోబరు 14(నమస్తే ఉ దయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో విస్తరించి ఉన్న ఈసా కాలువ బఫర్ జోన్ తో పాటు ఉప్పర్పల్లి జన చైతన్య పేజ్– 2 లోని పార్కులను కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను మ ంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు నేల మట్టం చేశారు. హిమాయత్ సాగర్ నుంచి అత్తాపూర్ వరకు గల ఈసా కాలువ కు ఇరువైపులా కబ్జాదారులు చిన్న చిన్న నిర్మాణాలు చేపట్టి బఫర్ జోన్ ను కబ్జా చేశారు. ఎక్కువగా జన చైతన్య పేజ్ -2 వద్ద బఫర్ జోన్ తో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చాలని ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ విశాల్ రెడ్డి లు తమ సిబ్బందితో కలసి సుమారు 700ల గజాల స్థలంలో ఉన్న ఆక్రమణలను నేలమట్టం చేశారు. ఈసా కాలువ బఫర్ జోన్ లో కానీ, పార్కు స్థలాలలో కాని ఎలాంటి ఆక్రమణలను ప్రోత్సహించేది లేదన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో జీహెచ్ఎం సీ ముందుండి పనిచేస్తుందన్నారు.

## పాఠశాల ప్రహరీపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయవద్దు


పాఠశాల ప్రహరీ పై ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

బుద్వేల్, అక్టోబరు 14 (నమస్తే ఉదయం) హైదర్ గూడ ప్రాథమిక పాఠశాల ప్రహరీ పైన నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వల్ల విద్యార్థులకు ప్రమాదాలు సంభవించే అవశాలున్నాయని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హైదర్ గూడ అధ్యక్షుడు జి.భాస్కర్ అన్నారు. గతంలో ఉన్న చోటనే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఉంటే బాగుంటుందని, అక్కడ చుట్టు కంచె వేస్తే సరిపోతుందన్నారు. అలా కాకుండ స్కూల్ ప్రహరీగోడ వద్ద స్థంబం, ప్రహరీగోడ పైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసేలా పనులు చేస్తున్నారన్నారు. ఈ పనులను అడ్డుకోవాలని తాను రాజేంద్రనగర్ మండల విధ్యాధికారిని కోరానని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ స్థలానికి దగ్గర లోనే మరుగుదొడ్లు ఉన్నాయని, వర్షాలు పడ్డప్పుడు విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉందన్నారు. పిల్లలు అడుకునే సమయంలో ఇనుప వస్తువులతో ఎవరైన ట్రాన్స్ ఫార్మర్ ను కొట్టినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో ఉన్న చోటనే ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని కోరారు.

## హైదర్ గూడ ప్రభుత్వ పాఠశాల వద్ద ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయవద్దు


హైదర్గూడ ప్రభుత్వ పాఠశాల వద్ద ప్రహరీ గోడ కానుకొని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్, అక్టోబర్ 14(నమస్తే ఉదయం) అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్ గూడ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ప్రమాదకరమైన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. స్కూలు ప్రహరీ గోడ కు అనుకొని విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల తరచుగా షాక్కు గురై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వివరించారు. స్కూల్ లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వేయకుండా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు.స్కూల్ పిల్లలకు ప్రమాదకరంగా ఉన్నది. పిల్లలు ఆట పాటలు అడుకుంటుంటారు అనుకోకుండా రాళ్లు తో గాని, వినుప ముక్కలతోగాని ఇంకా దేనితోనైన అనుకోని రీతిలో ట్రాన్స్ఫార్మర్ కు తగిలితే ప్రాణాలకే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్ గుర్తు చేశారు. ఏదైనా జరుగరనిది జరుగుతే పిల్లల ప్రాణాలకు ఎవ్వరు బాద్యులు అవుతారని ఆయన ప్రశ్నించారు.అందుకోసం స్కూళ్లలో నుంచి ట్రాన్స్ఫార్మర్ ను తొలగించాలని అధికారులను కోరారు.


జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారాన్ని ఉధృత పరిచిన బీఆర్ఎస్ మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి తో కలిసి ఎర్రగడ్డ డివిజన్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారంనిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ "జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను గుర్తుంచుకొని ఓటు వేస్తారని నాకు నమ్మకం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రతి ఇంటికి, ప్రతి హృదయానికి చేరాలని పేర్కొన్నారు."కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు మళ్లీ కాంగ్రెస్ మాటలను నమ్మే పరిస్థితి లేదు. నేను మహిళలను అడిగాను మీరు రూ.4,000 పెన్షన్ పొందుతున్నారా? సమాధానం అందరికీ తెలిసిందే!" అని ఎద్దేవా చేశారు."బీఆర్ఎస్ విత్తిన అభివృద్ధి విత్తనాలే ఈరోజు తెలంగాణలో ఫలితాలుగా కనిపిస్తున్నాయని, నిజాయితీగా పనిచేసే నాయకత్వం మాత్రమే రాష్ట్ర భవిష్యత్తును రక్షించగలదని ఆయన అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉత్తరాల ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ మున్సిపాలిటీ ) అక్టోబర్ 14 ( నమస్తే ఉదయం ) :- ఉత్తరాల ఉద్యమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అన్నారు. మంగళవారం ఘట్కేసర్ లో ఉన్న గురుకుల పాఠశాల కళాశాలలను కాపాడేందుకు మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఉ త్తరాల ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాల ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఘట్కేసర్ లోని గురుకుల పాఠశాల కళాశాలల పూర్వ వైభవం సంతరించుకునేలా ఈ ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఉ త్తరాల ఉద్యమంలో భాగంగా ప్రతి రోజు పోస్టు కార్డు ద్వారా గురుకులాల చరిత్రను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల ఆస్తులను కాపాడుతూ పాఠశాల, కళాశాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఉత్తరాలను పోస్టు ద్వారా పంపిస్తున్నామని చెప్పారు. నేటితో ఈ ఉద్యమం 168 వ రోజుకు చేరుకుందని వెల్లడించారు. గురుకుల పాఠశాల అభివృద్ధి చేపట్టేంతవరకు ఈ ఉత్తరాల ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


అల్వాల్ ఆరోగ్య కేంద్రంలో సిపిఆర్ పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్...

## సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

### డాక్టర్ శ్రీకాంత్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మల్కాజిగిరి నియోజకవర్గం) అక్టోబర్ 14 ( నమస్తే ఉదయం)అల్వాల్ సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం అల్వాల్ ఆరోగ్య కేంద్రంలో సి పి ఆర్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సిపిఆర్ అనగా మనిషి యొక్క గుండె కొట్టుకోవడం ఆగినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకొని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే సిపిర్ చర్యలు పునరుద్ధరణ చేయాలన్నారు. అత్యవసర ప్రక్రియ తక్షణమే హృదయ శ్వాస కోస పునరుజీవన చర్య చేపట్టాలన్నారు. గుండెపోటు బారిన పడిన వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చునని చెప్పారు. వాహనదారులకు ప్రమాదాలు జరిగిన వెంటనే 108 అంబులెన్స్ గానీ 100కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. దగ్గర్లో ఉన్న హాస్పిటల్స్ కు తరలించే ప్రాణాలను కాపాడాలని అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తులకు గుండెపోటు వచ్చినప్పుడు ప్రథమ చికిత్సగా సిపిఆర్ పైన అవగాహన ఉండాలని డాక్టర్ శ్రీకాంత్ తెలియపరిచారు. కార్యక్రమంలో అల్వాల్ సిఐ ప్రశాంత్ డి ఐ తిమ్మప్ప డాక్టర్లు అనఘ, శైలజ సురేందర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733